సాక్షి
కాకినాడ
గురువారం | 30 | నవంబర్ | 2023



నిందితుల కోసం గాలింపు

పుల్లలపాడులో తుపాకీతో దస్తావేజు లేఖరి కాట్రగడ్డ ప్రభాకరరావును హత్యచేసిన కేసులో నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

8లో



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తాళ్లపూడి మండలం వేగేశ్వరపురానికి చెందిన వీరమల్లు సూర్యనారాయణ, లక్ష్మీ సూర్యవతి దంపతులు బుధవారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు బుధవారం 3,900 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,300, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 2 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం: కలెక్టర్

కాకినాడ సిటీ: రెండు నెలల్లో జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను ముమ్మరం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు ప్రగతిని సమీక్షించారు. వచ్చే ఫిబ్రవరి రెండవ వారంలో మరో విడత సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం జరుగుతుందన్నారు. సుమారు 15 వేల మంది లబ్ధిదారులు గృహప్రవేశం చేసేందుకు వీలుగా నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. నిర్మాణ సామగ్రి, రుణ సహాయం కల్పన లాంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లన్నింటి నిర్మాణాన్ని స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టాలని ఆదేశించారు.

డిసెంబర్ 1 నుంచి ఓటు ప్రక్రియపై అవగాహన



కాకినాడ సిటీ: డిసెంబర్ 1వ తేదీ నుంచి అన్ని పోలింగ్ లొకేషన్లలో ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 6. 7. 8 ఫారాల పరిశీలన, పరిష్కార ప్రగతిని వివరించారు. కొత్త ఓటర్ల నమోదుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ వివరాలు తెలియజేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లతో ఓటు నమోదు చేసే విధానంపై జిల్లాలోని అన్ని పోలింగ్ లొకేషన్లలో ఓటరు అవగాహనా కార్యక్రమాల నిర్వహణకు కలెక్టర్ కృతికా శుక్లా జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు. డిసెంబర్ 1 నుంచి ఎన్నికల షెడ్యూల్ విడుదల వరకూ అవగాహన కొనసాగుతుందన్నారు.

మహిళా, శిశు సంక్షేమ శాఖలో పోస్టులకు దరఖాస్తులు

కాకినాడ సిటీ: జిల్లా బాలల సంరక్షణ కేంద్రం (శిశు గృహ)లోకాంట్రాక్ట్ పద్ధతిపై హైరింగ్ ద్వారా వివిధ పోస్టుల్లో పని చేసేందుకు అర్హత గల వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె ప్రవీణ తెలిపారు. రెండు ఆయా పోస్టులున్నాయి. వివాహితకు ఈ ఏడాది జూలై 1 నాటికి 25 సంవత్సరాలు నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. రూ. ,944 గౌరవవేతనం ఉంటుందన్నారు. బీసీ ఏ, ఓసీ కేటగిరిలకు చెందిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కాకినాడ.ఏపీ.జీవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ ప్రకారం విద్యార్హతలతో దరఖాస్తును ఈనెల 30వ నుంచి డిసెంబర్ 9వతేదీ లోపు తమ కార్యాలయంలో అందచేయాలని పీడీ కోరారు.

గంజాయి రహిత జిల్లాగా మార్చాలి

ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

కాకినాడ క్రైం: రేంజ్ పరిధిలో ఆరు జిల్లాల్లో గంజాయి ఉత్పత్తి, విక్రయాలు గణనీయంగా తగ్గాయని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లా యంత్రాంగం పని చేసి, కాకినాడను గంజాయి రహిత జిల్లాగా మార్చాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన ఆయన కాకినాడ డీఎస్పీ కార్యాలయం, దిశ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో రికార్డులు తనిఖీ చేశారు. డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా పరిధిలో క్రైం రేటు నియంత్రణకు ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందన్నారు. రౌడీమూకల నియంత్రణకు ప్రత్యేక కార్యచరణ అవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతిభద్రతల నిర్వహణలో తలమునకలై ఉండాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. స్పందన కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుని ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

‘కంటి’కి రెప్పలా..



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఎన్ రాఘవమ్మకు కళ్లు అసలు కనిపించడం లేదు. అడుగు తీసి అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. దీనికి తోడు వృద్ధాప్య భారం. కుటుంబ సభ్యులు కూడా తమ ఆర్థిక పరిస్థితులు సహకరించక ఆమెను కంటి వైద్యుని దగ్గరకు తీసుకు వెళ్లలేకపోతున్నారు. ఈనేపథ్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని తెలుసుకున్నారు. వలంటీరు సహాయంతో శిబిరం జరుగుతున్న చోటుకు తీసుకువెళ్లారు. వైద్యులు ఆమెను పరీక్షించారు. ఆరోగ్య శ్రీకింద చికిత్సకు దగ్గరలోని ఆస్పత్రికి రిఫర్ చేశారు.పదిరోజుల కిందట ఆమెకు ఆపరేషను చేశారు. రాఘవమ్మతో పాటు కుటుంబ సభ్యులు సంతోషిస్తున్నారు.

కంటి వైద్య సేవలు పొందిన రోగుల గణాంకాలు

జిల్లా	పరీక్షలు	మందులు	కళ్ల అద్దాలు అవసరం	పొందినవారు
కోనసీమ	47,721	13,293	32,169	1894
కాకినాడ	40,888	11,934	25444	1514
తూర్పుగోదావరి	37101	06585	27208	3081

కేటరాక్ట్ సర్జరీల గణాంకాలు

జిల్లా	గుర్తించిన కేసులు	సర్జరీ చేసినవి	చేయాల్సినవి
కోనసీమ	1994	174	1820
కాకినాడ	3070	221	2849
తూర్పుగోదావరి	2777	175	2602

75ఏళ్ల రంగారావుది కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరం. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. ప్రభుత్వ పెన్షనే ఆధారం. కొన్నాళ్లుగా వృద్ధాప్యం కారణంగా చూపు మందగించింది. కంటి పరీక్ష చేయించుకుందామంటే దారి లేదు. పెద్దాస్పత్రికి వెళ్తే చూస్తారో లేదో కూడా తెలియదు. దీంతో కనీకనిపించని కళ్లతోనే జీవితాన్ని నెట్టుకొచ్చేస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో ఇటీవల ఇంటికి వలంటీరు వచ్చింది. ఇంట్లో ఎవరికైనా అనారోగ్య సమస్యలున్నాయా అని అడిగింది. రంగారావు తన కంటి సమస్య చెప్పాడు. ఆమె వివరాలు రాసుకుని టోకెన్ ఇచ్చింది. దాని ప్రకారం దగ్గర్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వెళ్లాడు. కంటి పరీక్షలు చేశారు. కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. పైసా తీసుకోకుండానే కళ్లజోడు ఇచ్చి పంపించారు. ఆ వృద్ధుడు కళ్లలో కనిపించిన ఆనందం అంతా ఇంతా కాదు.

- పేదల కంటిచూపునకు ప్రభుత్వ భరోసా
- జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచిత వైద్య సేవలు
- అవసరమైన వారికి ఆస్పత్రుల్లో కేటరాక్ట్ ఆపరేషన్‌లు
- పరీక్షలు, మందులు, ఆపరేషన్లు అన్నీ ఉచితమే
- శిబిరాలకు భారీగా తరలివస్తున్న కంటి బాధితులు

సాక్షిప్రతినిధి,కాకినాడ : సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు పెద్దలు. శరీరంలో అత్యంత ముఖ్యమైనది కన్ను. అందుకే ఈ అవయవానికి ప్రభుత్వం కూడా చాలా ప్రాధాన్యతనిస్తోంది. కంటి వైద్య సేవలను జనరల్ సేవల్లోకి కాకుండా సూపర్ స్పెషాలిటీ సేవా విభాగంలోకి తీసుకు వచ్చారు. వయోభారం మీదపడ్డ వారికి కంటి సమస్య సాధారణం. కనుపాపకు ఇబ్బంది వస్తే జీవితమే అంధకారమవుతుంది. కాస్త ఆర్థిక స్తోమతున్న వృద్ధులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఎప్పటికప్పుడు కళ్లు చెక్ చేయించుకుంటారు. అవసరమైతే శస్త్ర చికిత్స చేయించుకుంటారు. మరి అదే సమస్య పేదింటి వృద్ధునికి వస్తే ..చాలా కష్టంగా ఉంటుంది జీవితం. ఇంట్లో చెప్పుకోలేక..చేతిలో డబ్బులు లేక చీకటిలోనే తమ బతుకులు అని సరిపెట్టుకుంటారు. అలాంటి వృద్ధులకు ఇక ఇబ్బంది లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారు. దాదాపు ప్రతి గ్రామంలోనూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను ఇంటికెళ్లి మరీ వలంటీరు సేకరిస్తున్నారు. దగ్గరలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించినప్పుడు వీరిని శిబిరంలో ఆప్తమాలజిస్టు పరీక్షిస్తున్నారు. ఉచితంగా కంటి అద్దాలను అందజేస్తున్నారు. అవసరమైన మందులు ఇస్తున్నారు. అవసరమైతే వీరి శస్త్రచికిత్సల బాధ్యతను కూడా తీసుకుంటోంది.

కంటి చూపు సమస్యతో బాధ పడుతున్న అన్ని వయసుల వారికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సేవలందిస్తున్నారు. అవసరమైన వారికి పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.40వేల నుంచి రూ.50వేలు ర్చు పెడితే కాని జరగని కంటి శస్త్రచిక్సితలు ఈ శిబిరాల ద్వారా చేస్తున్నారు. కంటి రోగులకు సంబంధించి శిబిరాల్లో విశేషమైన స్పందన లభిస్తోంది. డాక్టర్ కన్సెల్టెన్సీ ఫీజు దగ్గర నుంచి సుమారు రూ.10 వేలు విలువైన కంటి ఆపరేషన్ వరకూ సేవలన్నీ ఆరోగ్య శ్రీలో ఉచితమే. రూ.1000 నుంచి రూ.1500 విలువైన కళ్ళద్దాల వరకూ ఉచితంగా ఇస్తుండటంతో రోగులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ మొదలు సమస్య పరిష్కారమయ్యే వరకు అన్ని రకాల సేవల వివరాలు ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. జగనన్న శిబిరంలో కంటిరోగికి తొలుత దూరపు చూపు లోపం గుర్తించేందుకు మోనోక్యూలర్ టెస్ట్ చేస్తున్నారు. 60 శాతం కంటే తక్కువ సామర్థ్యం ఉంటే కంటి నుంచి మెదడుకు వెళ్లే నరాల తీరుపై దృష్టి పెడుతున్నారు. సాధారణ స్థాయిలో పరిష్కారమవుతుందనుకుంటే కంటి అద్దాలను ఇస్తున్నారు. ఎంపిక చేసిన రోగులను కేటరాక్ట్ ఆపరేషన్ కోసం ఆస్పత్రులకు పంపిస్తున్నారు. అక్కడ పరీక్షలు చేశాక కొందరిలో సమస్య తీవ్రతను గుర్తించి సర్జరీ చేస్తున్నారు. ఆరోగ్య శ్రీ లో సర్జరీ చేయించుకున్న వారం రోజుల తర్వాత మరోసారి పరీక్షిస్తున్నారు.



రాజమహేంద్రవరం రూరల్‌లో కంటి పరీక్షలు

పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్



చాన్నాళ్లుగా కళ్లు కనిపించక ఇబ్బందులు పడుతున్నాను. ఊళ్లో జగనన్న ఆరోగ్య సురక్ష జరుగుతుందని ముందుగా వైద్య సిబ్బంది మా ఇంటికి వచ్చి పరీక్షలు చేశారు. ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ అంటే భయపడ్డాను. పైసా ఖర్చవ్వదని చెప్పారు. పరీక్షలు చేయించి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ అయ్యాక రెండు రోజులకు ఒకసారి ఇంటికి వచ్చి చూసి వెళుతున్నారు.

– ఇసుకపాటి లక్ష్మి, ఓదూరు,రామచంద్రపురం మండలం

వారానికి 80 సర్జరీలు



గతంలో వారానికి 25 సర్జరీలు చేసే వాళ్లం. జగనన్న ఆరోగ్య సురక్ష నుంచి వస్తున్న కేసులతో వారానికి 65 నుంచి 80 వరకు కేటరాక్ట్ సర్జరీలు చేస్తున్నాం. కంటి సమస్యలు చూపించుకునే చిన్న పిల్లల సంఖ్య బాగా పెరిగింది. అది పూర్తిగా పాడైనప్పుడు మాత్రమే తెలుస్తుంటుంది. చూపు పూర్తిగా కోల్పోయే స్థితి నుంచి రోగులను కాపాడగలుగుతున్నాం.

– ప్రొఫెసర్ ఎస్ రమాభారతి. ఆప్తాలజీ హెడ్..జీజీహెచ్

జగన్ విజయాన్ని కాంక్షిస్తూ దవులూరి పాదయాత్ర



తిరుపతికి పాదయాత్రగా వెళుతున్న దొరబాబు

పెద్దాపురం: దేశ రాజకీయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర రాష్ట్ర చరిత్రను మలుపుతిప్పిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. , ప్రజా సంక్షేమానికి సాధకునిగా ప్రజలందరి గుండెల్లో సుస్థిర స్థానం సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 2024లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ తలపెట్టిన పాదయాత్రకు దవులూరి బుధవారం శ్రీకారం చుట్టారు. ఉదయం సామర్లకోట నుంచి పెద్దాపురం మండలం తిరుపతి స్వయం భూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి సుమారు 15 కిలో మీటర్ల మేర పాదయాత్రను ప్రారంభించారు. ఇలా ఏడు పర్యాయాలు పాదయాత్ర చేయనున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సామర్లకోట వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయన వెంట నడిచారు. ఆలయం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి,, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, గ్రామ ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అమరావతిలు ఆలయ వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు, నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో కలిసి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయంలో జగన్‌మోహన్‌రెడ్డి మరింత సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల సేవలో సీఎం కొనసాగాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ కులం, మతం, వర్గ బేధం లేకుండా పార్టీ రహితంగా సంక్షేమ పాలన అందిస్తూ కనీ వినీ ఎరుగుని పథకాలతో ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నది జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దూది రాజు, జగదీష్, సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, ఎంపీటీసీ గణేష్, ఉప సర్పంచ్‌లు వాసిరెడ్డి శ్రీనివాస్, గోలి రామారావు, తుమ్మల అచ్యుతరామయ్య, లక్కాకుల కృష్ణ, నరాలశెటి త్రినాథ్, పల్లా శ్రీనివాస్ యాదవ్, వల్లూరి కుట్టయ్య చౌదరి, ఒబిలిశెట్టి ఆనందం, కాశీవిశ్వనాథ్, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- వ్రతాలు 3,500
- ఆదాయం రూ. 40 లక్షలు
- నేటి నుంచి కొనసాగనున్న రద్దీ



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం బుధవారం తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం, వ్రతమండపాలు, క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా 3,500 వ్రతాలు జరిగాయని అధికారులు తెలిపారు. 25 మంది భక్తులు స్వామివారి నిత్య కల్యాణంలో రూ.1,116 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. భక్తులు రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షణ చేశారు.

గురువారం నుంచి సోమవారం వరకు రద్దీ

కార్తిక బహుళంలో సత్యదేవుని ఆలయానికి ఎక్కువ మంది భక్తులు వచ్చే ఆనవాయితీ ఉంది. దీంతో గురువారం నుంచి రత్నగిరి పై భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా శుక్రవారం నుంచి సోమవారం వరకు నాలుగు రోజులు సుమారు 25 వేల వ్రతాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రోజుకు 50 వేల నుంచి 75 వేల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి వ్రతాలు, స్వామివారి దర్శనం ప్రారంభించనున్నట్లు వీరు తెలిపారు. అన్ని మండపాలలో ఏక కాలంలో 1,500 మంది భక్తులు స్వామివారి వ్రతాలు ఆచరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సత్యదేవునికి కాసుల వర్షం



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్

హుండీల ద్వారా రూ.1.81 కోట్ల ఆదాయం

అన్నవరం: పవిత్ర కార్తిక మాసం స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి కాసుల వర్షం కురిపిస్తోంది. కార్తిక మాసంలో తొలి విడతగా దేవస్థానంలో హుండీలను బుధవారం తెరిచి లెక్కించగా రూ.1,81,26,154 ఆదాయం వచ్చింది. ఈ ఆదాయంలో ఎక్కువ భాగం కార్తికమాసంలోనిదే అని అధికారులు తెలిపారు. మొత్తం ఆదాయంలో నగదు రూ.1,76,17,654 కాగా, చిల్లర నాణేలు 5,08,500. ఏటా కార్తిక మాసంలో తొలివిడతగా పౌర్ణిమ తరువాత, రెండో విడతగా కార్తికమాసం ముగిశాక రెండు సార్లు హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించడం ఆనవాయితీ. హుండీల ఆదాయం లెక్కింపును దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు పర్యవేక్షించారు.

బంగారు, వెండి ఆభరణాలు

నగదుతో పాటు హుండీల ద్వారా స్వామివారికి 42 గ్రాముల బంగారం, 976 గ్రాముల వెండి, అమెరికా డాలర్లు 701, సింగపూర్ డాలర్లు 56, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ దీనార్లు 20, యూరోలు 15, కెనడా డాలర్లు 20, మలేషియా రిమ్స్ ఐదు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బహెరిన్ దినార్ ఒకటి, ఖతార్ సెంట్రల్ బ్యాంక్ కరెన్సీ ఒకటి, ఇండోనేషియా కరెన్సీ ఐదు రూపాయిలు, సౌదీ అరేబియా రియల్స్ మూడు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానంలో హుండీలను ఉదయం ఎనిమిది గంటలకు తెరిచి కానుకల లెక్కింపు ప్రారంభించగా మధ్యాహ్నం మూడు గంటలకు లెక్కింపు పూర్తయింది. దేవస్థానం సిబ్బందితో పాటు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

గతేడాది 3.11 కోట్లు

గతేడాది కార్తిక మాసంలో హుండీల ద్వారా రూ.3.11 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కార్తికమాసంలో తొలి విడతగా రూ.1.81 కోట్లు వచ్చింది. రెండో విడతలో మరో రూ.1.31 కోట్లు వస్తే గతేడాది ఆదాయాన్ని అధిగమించినట్లు అవుతుంది.

డిసెంబర్ 26న కాకినాడలో రంగనాడు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వంగ వీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 26న కాకినాడలో రంగనాడు పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రాధా రంగా రాయల్ అసోషియేషన్ అధ్యక్షులు గాదె బాలాజీ పేర్కొన్నారు. కాకినాడలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వంగవీటి మోహనరంగ ఒక వర్గానికో లేక ఒక కులానికో చెందిన వ్యక్తి కాదన్నారు. ,కుల మతాలకు అతీతంగా అభిమానించదగ్గ నాయకుడన్నారు. రంగా ఆశయాలు నేటి తరానికి తెలియజేస్తూ ముందుకు వెళ్లాలని గత ఎనిమిది సంవత్సరాలుగా వివిధ జిల్లాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ సారి కాకినాడలో భారీ స్థాయిలో సభ నిర్వహిస్తామన్నారు. అన్ని వర్గాల వారూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘ గౌరవ అధ్యక్షులు సాయి సుధాకర్ నాయుడు, రాష్ట్ర దళిత నాయకులు కామేశ్వరరావు, కాపు సంఘ నేతలు నాగబాబు,మహేష్,చంటిబాబు,తడాల గంగాధర్ పాల్గొన్నారు.



రంగనాడు సభ విజయవంతం చేయాలంటూ ఐక్యత చాటుతున్న నాయకులు

పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

- ప్రింటింగ్ క్లస్టర్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం
- కలెక్టర్ నుంచి కార్యక్రమానికి హాజరైన అధికారులు



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడలో ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎంఎస్‌సీ–సీడీపీ) కింద రూ. 14.76 కోట్లతో ఏర్పాటు చేసిన శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరం నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, పరిశ్రమల శాఖ జీఎంటీ మురళి, ఏపీఐఐసీ జెడ్ఎం మురళీమోహన్ తదితరులు హాజరయ్యారు. వర్చువల్ ద్వారా జరిగిన సీఎం కార్యక్రమం ముగిశాక ప్రింటింగ్ క్లస్టర్‌కు సంబంధించిన శిలాఫలకాన్ని కలెక్టర్ కృతికా శుక్లా అతిథులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు.

ఉపాధి కల్పన

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద కాకినాడలో ప్రింటింగ్ క్లస్టర్లును ఏర్పాటైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఇండస్ట్రీయల్ ఎస్టేట్ అభివృద్ధికి ఎంఎస్ఈ–సీడీపీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రోత్సాహంతో 70 శాతం కేంద్ర నిధులు రూ.10.33 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.95 కోట్లు, స్పెషల్ పర్పస్ వెహికల్ లబ్ధిదారుల విరాళంతో మిగిలిన 10 శాతం నిధులు సమకూర్చాయని పేర్కొన్నారు. ఇందులో 250 చిన్న, తరహా, సూక్ష్మ స్థాయి ప్రింటింగ్ యూనిట్ల ద్వారా వెయ్యి మందికి ప్రత్యక్షంగా, ఐదువేల మంది పరోక్షంగాను ఉపాధి పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పరిశ్రమల స్థాపనతో జిల్లాలో వేలాది మందికి ఉపాధి అవకాశాలను కలిస్తోందన్నారు. జిల్లాను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా కృషి చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దాపురం ఇండస్ట్రియల్ ఏరియాలో కూడాశంకుస్థాపన జరిగిందన్నారు. చిన్న చిన్న పరిశ్రమలకు వీటిని అద్దెకు ఇస్తారన్నారు. ఈ కాంప్లెక్స్ నిర్మాణం వచ్చే మార్చి నాటికి పూర్తవుతుందని చెప్పారు. ఇందులో షెడ్లు కావలసిన వారు ఏపీఐఐసీని సంప్రదించాలన్నారు. ఎంఎస్ఎంఈలకు సంబంధించి వచ్చే ఫిబ్రవరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహకాలను అందజేస్తారన్నారు.

క్లుప్తంగా

కమ్మని మామిడి.. తిందాం పదండి



మామిడి చెట్టుకు కాసిన కాయలు

పిఠాపురం: మార్చి నెల రాకుండానే మామిడి పండ్లు ఏమిటి అనుకుంటున్నారా..! అవును నిజమేనండి. కొత్తపల్లిలో యువ రైతు ఉల్లి సురేష్ తన పొలంలో మూడేళ్ల కిందట నాటిన మామిడి చెట్టు ఇప్పుడు కాపు కాస్తోంది. గత నెల రోజులుగా సుమారు 50 మామిడి పండ్లు కాసినట్టు సురేష్ తెలిపారు.

పోస్టులకు ఇంటర్వ్యూలు

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో 17 మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డిసెంబర్ 1న కాకినాడ డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కాకినాడ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడు చేసుకోవాలన్నారు.

నేడు ధర్మపథం కార్యక్రమం

ఆత్రేయపురం: స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ధర్మపథం కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. హిందూ, సనాతన ధర్మం ప్రచారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ ధర్మపథం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అయినవిల్లి వినాయకుని అభిషేకం, హోమం, వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఇంట్లోకి చోర్‌బడకుండా..

- చోరీల నివారణకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం
- వినియోగించుకోవాలంటున్న పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: సెలవులు వచ్చాయని.. పెళ్లిళ్లకని... బంధువుల ఇంటికని ఇతర ఊళ్లకు వెళ్లేవారికి ఎప్పుడూ గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి.. ఇంటికి తాళం వేసి వెళ్తున్నా వచ్చేసరికి ఏం జరుగుతుందోననే భయం ఉంటోంది. ఎందుకంటే తాళాలు బద్దలు కొట్టి ఇంటిని గుల్ల చేస్తున్న ప్రబుద్ధులు ఉంటుండగా, ఇలా జరుగుతున్న ఘటనలు కోకొల్లలు. అలాంటి భయం, ఆందోళనకు చెక్ పెట్టేలా 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం'ను పోలీసు వ్యవస్థ తీసుకొచ్చింది. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పోలీసులు కోరుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా దొంగతనాల నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం 'లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం' (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచిస్తున్నారు. సెలవులపై వేరే ప్రదేశాలు, తీర్థ యాత్రలు, ఇతర శుభకార్యాలకు వెళ్లేవారు తమ విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలని, ఇంట్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఈ సిస్టం వినియోగించుకోవాలని అంటున్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్, రిక్వెస్ట్ పోలీసు వాచ్‌ను ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఎలా చేయాలో ఆయన వివరించారు. అవి ఇలా..

ఏం చేయాలంటే..

- ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను ముందుగా ఆండ్రాయిడ్ యూజర్స్ గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐ ఫోన్ యూజర్స్ యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేయాలి.
- ఈ యాప్‌లో వినియోగదారులు ముందుగా తమ పేరు, మొబైల్ నంబరు, చిరునామా వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్‌ను ఆ ఇంటి వద్దే ఉండి చేస్తే ఆటోమేటిక్‌గా ఇంటి లాంగిట్యూడ్, లాటిట్యూడ్ కూడా పోలీసు వారి వద్ద నమోదవుతుంది. వెంటనే వారి మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయగానే ఒక వినియోగదారునిగా పోలీసు వద్ద నమోదు అయినట్టు ఒక రిజిస్ట్రేషన్ నంబరు కూడా వస్తుంది.
- ఆ రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఉపయోగించి ఎప్పుడైనా ఇంటికి తాళం వేసి బయటకు వెళుతున్నప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌లో రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌లో ఫలానా తేదీ నుంచి ఎన్ని రోజులు ఊరు వెళ్తున్నారో వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి.



లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ పోస్టర్



ఈ సేవలు.. పూర్తి ఉచితం

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా అందిస్తున్న సేవలు పూర్తిగా ఉచితం. దొంగతనం జరిగిన తర్వాత ఇబ్బంది పడే కంటే ముందుగానే ప్రజలు స్పందించి ఈ సేవలను వినియోగించుకోవాలి. దీనిపై ఇప్పటికే పోలీసులు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. బయట ఊళ్లకు వెళ్లే వారు తమ విలువైన సామగ్రిని భద్రపరుచుకోవాలి.

–పి.జగదీష్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

- ఆండ్రాయిడ్ మొబైల్ లేని వినియోగదారులు, ఆండ్రాయిడ్ మొబైల్స్‌ను ఆపరేట్ చేయలేని వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ఫోన్ నంబర్లు 94932 06371, 99084 54580కు తెలియజేయాలి. వెంటనే వినియోగదారుల ఇంటికి పోలీసు వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమేరా అమర్చుతారు.
- కెమేరాను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానిస్తారు. అప్పటి నుంచి ఆ ఇల్లు పోలీసు నిఘాలో ఉంటుంది.
- ఆ ఇంట్లోకి ఎవరైనా దొంగలు ప్రవేశిస్తే కెమేరా పనిచేయడం ప్రారంభించి ఫోటోలు, లైవ్ వీడియోను పోలీసు కంట్రోల్ రూమ్‌కు పంపుతుంది. అలాగే కంట్రోల్ రూమ్‌లో ఒక అలారం మోగుతుంది. తద్వారా పోలీసు స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది నిమిషాల వ్యవధిలోనే దొంగతనాన్ని అరికట్టి, దొంగను పట్టుకుంటారు.

3 నుంచి గుంటూరులో అగ్రిటెక్-2023

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 3, 4, 5 తేదీలలో గుంటూరు లాంలో అగ్రిటెక్-2023 నిర్వహిస్తామని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎం.నందకిశోర్ తెలిపారు. ఇందులో ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై సదస్సు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉపకులపతి శారదాజయలక్ష్మి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పాల్గొంటారన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డిసెంబర్ 1 నుంచి 3 వరకూ డెహ్రాడూన్‌లో జరిగే 37వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు సంఘ కార్యదర్శి బి.అర్జునరావు బుధవారం తెలిపారు. టీసీఎస్ శ్రీచరణ్, ఎ.దినకర్, డి.ధనుష్, బి.అనుదర్శిత్, కేవీ నరసింహమూర్తి, బి.హర్షవర్ధన్, ఆర్‌హెచ్‌వీ మూర్తి, కె.లాస్య, జి.లాహితితేజ, వై.ఆశ్రిత, పూజితాదేవి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 18, 19 తేదీలలో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపి పతకాలు సాధించారన్నారు. వీరిని జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, తైక్వాండో సంఘ అధ్యక్షుడు మధుసుదన్‌రావు, రిఫరీలు సత్యనారాయణ, తులసి, మూర్తి, కేవీ సత్యనారాయణ అభినందించారు.



తైక్వాండో జట్టుతో సంఘ కార్యదర్శి అర్జునరావు తదితరులు

నేత్రపర్వంగా భీమేశ్వరస్వామి తెప్పోత్సవం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి తెప్పోత్సవం బుధవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. కార్తిక మాసంలో స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని ఈ వేడుక నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను బ్యాండ్ మేళాలు, వేదమంత్రాల మధ్య ఆలయ కోనేరు వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకువచ్చారు. వివిధ పుష్పాలు, విద్యుత్తు దీపాలతో అలంకరించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ పండితులు పూజాదికాలు నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ఈఓ టి.వెంకట సూర్యనారాయణ, తెప్పోత్సవం నిర్వహించే దాతలు కటకం సతీష్, సురేష్ దంపతులు వేదికపై పూజలు చేశారు. బాణసంచా కాల్పుల మధ్య స్వామి, అమ్మవార్లకు ఆలయ కోనేరులో హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. మూడు పర్యాయాలు స్వామివారి జలవిహారం కనుల పండువగా జరిగింది. అనంతరం దాతల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి సేవలందించారు.



పంచారామ క్షేత్రంలోని పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం

11, 12 తేదీల్లో కళాఉత్సవ్ పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డైట్ కళాశాలలో వచ్చే నెల 11, 12వ తేదీల్లో కళా ఉత్సవ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల ప్లస్‌లలో 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. గాత్రంలో సంగీతం, జానపదం, వాయిద్య సంగీతంలో వాయిద్య, మెలోడి, నాట్యంలో సంప్రదాయ, జానపద విభాగాల్లో పోటీలు డిసెంబర్ 11న ఉంటాయన్నారు. దృశ్య కళల్లో ద్విమితీయ, త్రిమితీయ, సంప్రదాయబద్ధ ఆట బొమ్మలు అండ్ ఆటలు, నాటిక (ఏకపాత్రాభినయం) విభాగాల పోటీలు 12న నిర్వహిస్తామన్నారు. ఒక విద్యాసంస్థ నుంచి ఒక్కొక్క కళా రూపంలో ఒక బాలుడు, ఒక బాలిక (విడివిడిగా) పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పాఠశాల తరఫున పాల్గొనే వారి వివరాలను, పోటీ అంశాలను ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ, బొమ్మూరు ఈ–మెయిల్ gdieteg@gmail.comకు డిసెంబరు 8వ తేదీలోగా పంపి రిజిస్టర్ చేయించుకోవాలని రమణ తెలిపారు.